క్లుప్తంగా

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ


దాక్టర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): బీఆర్‌ఎస్ బైక్ ర్యాలీలో గాయపడి చికిత్స పొందుతున్న కార్యకర్తలను యశోద ఆస్పత్రిలో దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఇటీవల బైక్‌ర్యాలీకి వెళ్తున్న బీ.కొండాపూర్ కార్యకర్తలు ఏసు, స్వామిలను ట్రాక్టర్ ఢీకొట్టగా ఇద్దరి కాళ్లకు గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం యశోద ఆస్పత్రికి తరలించగా ఆదివారం ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి బాధితులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు రాజిరెడ్డి, గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

గ్రిల్స్ ఏర్పాటు


ఆలయం చుట్టూ ఏర్పాటు చేసిన గ్రిల్స్

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలో ప్రసిద్ధి చెందిన సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఉప ఆలయాల్లో దాతలు ఆదివారం గ్రిల్స్ ఏర్పాటు చేయించారు. నవగ్రహాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో గ్రిల్స్ లేకపోవడంతో కోతుల సంచారంతో భక్తులు ఇబ్బందులు పడుతున్న విషయం గుర్తించిన దాతలు జయలక్ష్మి, సత్యనారాయణ ఆలయాల చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేయించారు.

వెంకట్రామిరెడ్డిని గెలిపించండి

జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత


మనోహరాబాద్‌లో ప్రచారం చేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ హేమలత

మనోహరాబాద్(తూప్రాన్): మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పురం మహేశ్, మండల నాయకులు వెంకట్‌గౌడ్, రేణుకుమార్, సఫీయొద్దీన్, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణాగౌడ్, వెంకటేష్, భిక్షపతి, మహేందర్‌గౌడ్, సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు


కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నేతలు మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చింతల మమతరవి, మాజీ వార్డు సభ్యులు చింతల బాబు, బానుప్రియ, యాదగిరిలతో పాటు పలువురు నాయకులు, మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్‌తోనే సామాన్యులకు న్యాయం జరుగుతుందని, ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని నర్సారెడ్డి అన్నారు.

శివ్వంపేటలో నేడు సర్వసభ్య సమావేశం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కల్లూరి హరికృష్ణ తెలిపారు. ప్రతీ మూడు నెలలకోసారి నిర్వహించే సాధారణ సర్వసభ్య సమావేశంలో భాగంగా సోమవారం ఉదయం 11:30 గంటలకు ఎంపీడీఓ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వివిధ సమస్యలతో పాటు ముఖ్యంగా వేసవికాలం దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సిబ్బందితో చర్చించనున్నట్లు తెలిపారు.

దళిత మోర్చా మండల అధ్యక్షుడిగా రాములు

మిరుదొడ్డి(దుబ్బాక): బీజేపీ దళిత మోర్చా మండల అధ్యక్షుడిగా రాములు నియమితులయ్యారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా నియమించినందుకు సంతోషంగా ఉందన్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి


బేతాళ స్వామి ఆలయ ప్రాంగణంలో భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారి ఆలయానికి భక్తుల రద్దీతో ఆలయం అంతా కిటకిటలాడింది. ఆదివారం చిలప్‌చెడ్ మండలంలోని చిట్కుల్ శివారులో మంజీరా తీరాన వెలసిన అమ్మవారికి దర్శనానికి భక్తులు మంజీరా నదిలో స్నానమాచరించి అమ్మవారి దర్శించుకున్నారు. ప్రదక్షిణలు చేసి ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ.. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు.

కిటకిటలాడిన నల్లపోచమ్మ ఆలయం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శివప్ప, రాజేశ్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు తీసి ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో ఆలయ ప్రాంగణం కిటకటిలాడింది. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించి వాహనాలకు పూజలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా బండ్ల ఊరేగింపు

అల్లాదుర్గం (మెదక్): అల్లాదుర్గంలో కొలువుదీరిన బేతాళ స్వామి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం బేతాళ స్వామికి బండ్లను కట్టి భక్తులు ఊరేగింపుగా వెళ్లి స్వామి వారి ఆలయం చుట్టు ప్రదీక్షణలు చేశారు. చిన్న పిల్లలు, పెద్దలు బండ్లను పోటాపోటీగా ఆలంకరించి డాన్సులు, నృత్యాలతో జాతరలో హాజరయ్యారు. యువకులు గొర్రె పొటెళ్లను చిన్న బండ్లకు కట్టి ఉరేగించారు. అల్లాదుర్గం, రెడ్డిపల్లి, రాంపూర్, కాయిదంపల్లి, బహిరన్‌దిబ్బ, వెంకట్‌రావ్‌పేట, చెవెళ్ల గ్రామాలకు చెందిన భక్తులు మొక్కలను తీర్చుకునేందకు ఎడ్ల బండ్లను బేతాళునికి ప్రదీక్షణలు చేశారు. జాతర చూసేందుకు ప్రజలు తండోపతండాలుగా తరలి వచ్చారు. బేతాళ స్వామి ఆలయ ప్రాంతం జనసంద్రంగా మారింది. ఎటు చూసిన జనాలతో నిండిపోయింది. బండ్ల ఊరేగింపును తిలకించేందుకు చిన్న పిల్లలు, మహిళలు నూతన వస్త్రలు ధరించి తరలివచ్చారు.


అల్లాదుర్గం(మెదక్): బేతాళస్వామికి బండ్లను ఊరేగిస్తున్న గ్రామస్తులు


చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మోదీ సభను విజయవంతం చేయాలి


బీజేపీలో చేరుతున్న ఆరేపల్లి యువకులు

పెద్దశంకరంపేట(మెదక్): అల్లాదుర్గంలో ఈ నెల 30న నిర్వహించే మంగళవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఆరేపల్లి గ్రామానికి చెందిన పలువురు యువకులు బీజేపీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి జహీరాబాద్‌లో బీజేపీ అభ్యర్థి బీబీ.పాటిల్ గెలుపుకు కృషి చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో శ్రావణ్, అనిల్‌రావు, సుధాకర్, అంజయ్య, విజయ్, శ్రీనివాస్, సాయిలుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులు కాపాడుకోవాలి

జిల్లా పంచాయతీ కార్మిక సంఘం కార్యదర్శి ఆసిఫ్


మాట్లాడుతున్న పంచాయతీ కార్మిక నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): కార్మికుల హక్కులను కాపాడుకోవాలని, మేడేను ప్రతి కార్మికుడు విజయవంతం చేయాలని జిల్లా గ్రామ పంచాయతీల కార్యదర్శి ఆసిఫ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. మేడేను వివిధ రంగాల కార్మికులు తమ హక్కులను కాపాడుకోవాలన్నారు. 40 ఏళ్లుగా పని చేస్తున్న ఉద్యోగులకు కూడా ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. గ్రామ పంచాయతీ వర్కర్లను మల్టీపర్పస్ పేరుతో వారి శ్రమను దోచుకని చాలీచాలని వేతనాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత


పరిసరాలను శుభ్రం చేస్తున్న సీఎంఆర్ విద్యార్థులు

మనోహరాబాద్(తూప్రాన్): పరిసరాల పరిశుభ్రత, చెట్ల సంరక్షణ అందరి బాధ్యత అని సీఎంఆర్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, జేఎన్‌టీయూ కో–ఆర్డినేటర్ శోభారాణి అన్నారు. ఆదివారం మండలంలోని గౌతోజీగూడెంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు స్వచ్ఛభారత్ చేపట్టి నిర్వహించి పలు వీధులను, పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం మొక్కలకు నీరు పట్టారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నిఖిల, సతీష్, మాజీ ఉప సర్పంచ్ రేణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

రామాయంపేట(మెదక్): మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామంలో 1997 – 98 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అప్పటి ఉపాధ్యాయుల సేవలను గుర్తు చేసుకొని వారిని సన్మానించారు. 26 ఏళ్ల క్రితం వీడిపోయిన వారంతా ఒకచోట చేరి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమ బ్యాచ్‌లో ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్న వారిని ఆదుకోవాలని వారు నిర్ణయించుకున్నారు.

హక్కుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన జిల్లా మానవ హక్కుల కమిటీ ప్రతినిధులు

రామాయంపేట(మెదక్): మానవ హక్కుల పరిరక్షణలో భాగంగా మనం ప్రజలను చైతన్యపర్చాల్సిన అవసరం ఉందని జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు భద్రయ్య సూచించారు. ఆదివారం రామాయంపేటలో నిర్వహించిన సంఘం జిల్లా సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతీ ఒక్కరు తమ హక్కులు, బాధ్యతల విషయమై గుర్తు ఉంచుకోవాలని సూచించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భద్రయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమురయ్య జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా తూప్రాన్‌కు చెందిన సాయిప్రసాద్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా రామాయంపేటకు చెందిన పొలాస ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా రాధాకృష్ణ, వెంకటేశంను ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘం ప్రతినిధులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మే డే ఉత్సవాలు జయప్రదం చేద్దాం

నర్సాపూర్: మే ఒకటిన చేపట్టే మే డే ఉత్సవాల్లో కార్మికులందరూ పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు కోరారు. మే డే సందర్భంగా జిల్లాలో చేపట్టే ఉత్సవాల్లో కార్మికులు పాల్గొని తమ ఐక్యతను చాటాలని ఆయన కోరారు.

గ్రంథం కోసం వ్యాసాలకు ఆహ్వానం

నర్సాపూర్: జిల్లా సమగ్ర స్వరూప గ్రంథం రూపొందించేందుకు పలు అంశాలపై వ్యాసాలను తెలంగాణ సారస్వత పరిషత్ ఆహ్వానిస్తుందని జిల్లా కన్వీనర్ డాక్టర్ రాయరావు సూర్యప్రకాష్‌రావు తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల చరిత్ర, సంస్కృతి, భాష, సాహిత్యం తదతర అంశాలపై తెలంగాణ సారస్వత పరిషత్ జిల్లాల సమగ్ర స్వరూప గ్రంథాలను ప్రచురించేందుకు చర్యలు తీసుకుంటుందని ఆయన చెప్పారు. పూర్తి వివరాలకు తనను 94410 46839 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పట్టణంలో నేడు ఓబీసీ మోర్చా సమ్మేళనం

నర్సాపూర్: బీజేపీ ఓబీసీ మోర్చా మెదక్ పార్లమెంట్ స్థాయి సమ్మేళనం నర్సాపూర్‌లో ఏర్పాటు చేసినట్లు ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కాశీనాథ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్ చెప్పారు. సమ్మేళనం సాయికృష్ణ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఉదయం పది గంటలకు ఏర్పాటు చేశామన్నారు. ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుతో పాటు పలువురు నాయకులు పాల్గొంటారని ఓబీసీ ప్రతినిధులు సకాలంలో రావాలని వారు కోరారు.

మే 1 నుంచి ఉచిత యోగా శిక్షణ

చేగుంట(తూప్రాన్): మే 1 నుంచి ఉచిత యోగా శిక్షణ కల్పించనున్నట్లు జీవనమంత్ర యోగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు. చేగుంటలోని గీత పాఠశాలలో యోగా శిక్షణ కల్పించనున్నట్లు ఉదయం 5 నుంచి 6 వరకు ప్రాణాయామం, ధ్యానం 6 నుంచి 7 – 15 వరకు అష్టాంగ యోగా, సాయత్రం 6–30 నుంచి 7–30 వరకు 14 ఏళ్ల బాలబాలికలకు అడ్వాన్స్ యోగా, పెద్దలకు బరువు తగ్గించే వ్యాయామంపై శిక్షణ కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు.

శిశుమందిర్ పాఠశాల భవనం ప్రారంభం


ప్రారంభోత్సవానికి హాజరైన దాతలు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలో నూతనంగా నిర్మించిన సరస్వతీ శిశు మందిర్ పాఠశాల భవనానికి ప్రారంభించారు. ఆదివారం ఈ సందర్భంగా దాతలు బాణాపురం కృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలతో పాటు పుణ్య వచనం, హోమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు విఠల్‌రెడ్డి, రిటైర్డ్ ఏడీ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ పండరిగౌడ్, రిటైర్డ్ ఉద్యోగి, అయ్యవారు ఆంజనేయులు, ప్రముఖ వైద్యులు గోపాల్‌రెడ్డి, ప్రముఖ పారిశ్రామిక వేత్త ప్రదీప్‌కుమార్, మాజీ ఉప సర్పంచ్ యోగి, నరేష్, సోమరాజు, రాజు, మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం గౌడ్, లక్ష్మణ్‌యాదవ్, బాబు పాల్గొన్నారు.

సేవాలాల్ మార్గం అనుసరణీయం

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

పాపన్నపేట(మెదక్): గిరిజన ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మార్గం అందరికీ అనుసరణీయమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. మండలంలోని రాజ్యా తండాలో ఆదివారం ఆయన సేవాలాల్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవాలాల్ దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు. మండలంలో నెలకొన్న నీటి ఎద్దడి తీరుస్తానని ప్రకటించారు. సోమ్లా తండాలో సేవాలాల్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కొంపల్లి గ్రామ జనార్దన్‌రెడ్డిని ఆయన పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, గౌస్, శ్రీను, అధికారులు పీక్యా, శంకర్ ఉన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం


పాపన్నపేట (మెదక్): అన్నారంలో బీజేపీ నాయకుల ప్రచారం


చేగుంట(తూప్రాన్): రాంపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

పాపన్నపేట (మెదక్): కేంద్రంలో బీజేపీ హ్యాట్రిక్ ఖాయమని మండల బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు సంతోష్ అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని అన్నారం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ మూడోసారి ప్రధాని అవుతారని చెప్పారు. మెదక్ నియోజకవర్గంలో బీజేపీ పవనాలు వీస్తున్నాయన్నారు. కమలం గుర్తుకు ఓటేసి రఘునందన్‌రావును గెలిపించాలని కోరారు.

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలంలోని రాంపూర్, కరీంనగర్, సోమ్లాతండాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావును గెలిపించాలని కోరారు. మోదీ ప్రధానమంత్రిగా ఉంటేనే దేశం భద్రంగా ఉంటుందని దేశ భద్రత కోసం బీజేపీకి కేంద్రంలో అధికారం కల్పించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు భూపాల్, నియోజకవర్గ కన్వీనర్ ఎస్ఎన్ చారి, కోకన్వీనర్ గోవింద్, మాజీ సర్పంచ్‌లు బాలచందర్, నాగభూషణం, సోషల్ మీడియా ఆంజనేయులు, నర్సింలు, చంద్రశేఖర్, సాయిప్రసాద్‌తో పాటు పలువురు కార్యకర్తలు ఉన్నారు.

నార్సింగిలో బీజేపీ ఇంటింటి ప్రచారం

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వివరిస్తూ బీజేపీకి ఓటువేసి గెలిపించాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపట్టిన కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు బాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు లింగారెడ్డి, లక్ష్మణ్, గురుపాదంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

రఘునందన్‌రావును గెలిపించండి

రామాయంపేట(మెదక్): మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి .రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు మున్సిపాలిటీ పరిధిలోని గుల్పర్తి గ్రామంలో ప్రచారం చేశారు. గ్రామంలో కనీస వసతులు సైతం కరువయ్యాయని, సమస్యల పరిష్కారం విషయమై ఎవరూ పట్టించుకోవడంలేదని పార్టీ సీనియర్ నాయకుడు శంకర్‌గౌడ్ ఆరోపించారు. ఈమేరకు ఆయన ఆధ్వర్యంలో కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మాయమాటలు నమ్మొద్దు


జంగంరెడ్డిపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని బీఆర్‌ఎస్ జగదేవ్‌పూర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని తీగుల్ నర్సాపూర్‌లో ఉన్న కొండపోచమ్మతల్లి, కోదండ రామచంద్రస్వామిలను ఆదివారం దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం జంగంరెడ్డిపల్లిలో నాయకులతో కలిసి బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలి

గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి

ములుగు(గజ్వేల్): చెక్‌పోస్టు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా సరిహద్దు గ్రామమైన వంటిమామిడి రాజీవ్‌రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు, మద్యం, ఓటర్లను ప్రలోబాలకు గురిచేసే వస్తువులు, మాదకద్రవ్యాల రవాణా కాకుండా చర్యలు చేపట్టామన్నారు.

ప్రతిభకు అంగవైక్యలం అడ్డు కాదు

- పుట్టుకతో మూగ, చవిటి
- చిత్ర లేఖనంలో రాణిస్తున్న విద్యార్థి


తయారు చేసిన యంత్రాలు, చంద్రయాన్


రాధాకృష్ణ చిత్రం

శివ్వంపేట(నర్సాపూర్): పుట్టుకతో అతనికి మూగ, చవిటి ఉన్నప్పటికీ నిరాశ చెందకుండా చిత్ర లేఖనంతో పాటు కాటన్ అట్టలతో వివిధ యాంత్రాలు తయారు చేస్తు ఔరా అనిపిస్తున్నాడు. మండల కేంద్రం శివ్వంపేట వ్యవసాయ కుటుంబానికి చెందిన అల్లపురం మాలతి నర్సింలు దంపతులకు ఇద్దరు కూతుర్లతో పాటు కొడుకు మదన్‌కుమార్ పుట్టుకతోనే మూగ, చెవిటితో ఉంది.

చిత్రలేఖనంలో రాణిస్తూ....

మదన్‌కుమార్ శివ్వంపేటలోని ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం 8వ తరగతి చదువుతున్నాడు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను కంటి చూపుతో అర్థం చేసుకుంటూ తోటి విద్యార్థులతో పోటీ పడుతూ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తున్నాడు. మనిషిని చూసి అతని చిత్రం వేయగలడు.దేశ ప్రముఖులతో పాటు వివిధ హీరోలు, కుటుంబ సభ్యుల చిత్రాలు వేస్తున్నాడు. యూట్యూబ్‌లో చూస్తూ.. పాత కాటన్ అట్టలతో చంద్రయాన్–2 మోడల్, జేసీబీ, కారు, బైక్, లారీ, కెమెరా తదితర యంత్రాల తయారు చేస్తూ.. పాఠశాలలో నిర్వహించిన పలు పోటీల్లో సైతం ప్రతిభ కనబరుస్తున్నాడు.

ప్రోత్సాహం కావాలి

మదన్‌కుమార్‌ని ప్రభుత్వం ప్రోత్సహించి అంగవైకల్యం సంబంధించిన బోధనలో అవకాశం కల్పిస్తే మరింతగా రాణిస్తాడు. ఇతను పుట్టుకతో మూగ, చవిటి ఉన్నప్పటికీ ప్రభుత్వ పెన్షన్‌కు మాత్రం నోచుకోలేదు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి.

పెన్షన్ ఇప్పించండి



పుట్టుకతో అంగవైకల్యం ఉన్నప్పటికీ ప్రభుత్వం నుంచి పెన్షన్ రావడం లేదు. అధికారులు స్పందించి పెన్షన్‌తో పాటు, అతనికి నచ్చిన రంగాల్లో శిక్షణ ఇస్తే బాగుంటుంది.

– మాలతి,నర్సింలు, విద్యార్థి తల్లిదండ్రులు